క్లుప్తంగా

28న పట్టణ వైఎస్సార్ సీపీ సమావేశం

అమలాపురం టౌన్: పట్టణ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం భట్నవిల్లిలోని మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయ ఆవరణలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని గురువారం తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డుల ఇన్‌చార్జులు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరుకావాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

పేపర్ ప్లేట్ యూనిట్ ప్రారంభం



పేపర్ ప్లేట్ యూనిట్ ప్రారంభిస్తున్న బోసురాజు తదితరులు

ముమ్మిడివరం: మండలంలోని ముషినివారి పాలేనికి చెందిన స్వయం సహాయక సంఘ సభ్యురాలు వాసంశెట్టి రామ సూర్యావతి ఏర్పాటుచేసిన పేపర్ ప్లేట్ యూనిట్‌ను నగర పంచాయతీ వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించడంలో భాగంగా నగర పంచాయతీ మెప్మా విభాగం ద్వారా యూనిట్ ఏర్పాటుకు రూ.2,60,000 మంజూరైందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిపెల్ల రామకృష్ణంరాజు, రాయపురెడ్డి జానకిరామయ్య, కె.రాంజీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని భద్రకాళీ అమ్మవారికి గురువారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే ఆలయ ఆవరణలో గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం, పూర్ణాహుతి తదితర పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

ఐ.పోలవరం: ఈ నెల 28న పి.గన్నవరంలో జరిగే మాదిగల, ఉపకులాల బహిరంగ సభను విజయవంతం చేయాలని మాదిగల పొలిటికల్ జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం మురమళ్ల చెయ్యేటివారిపేటలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ముఖ్యనాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో జేఏసీ చైర్మన్ చుట్టుగుళ్ల నీలకంఠం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, దీనిపై త్వరలో మంచి నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆకుమర్తి చిన్న, వీధి లోవరాజు, చెయ్యేటి శ్రీను, బదుగు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ఐ.పోలవరం: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఐ.పోలవరంలో జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆకెళ్ల సూర్యమోహన్, ప్రధాన కార్యదర్శిగా వెన్నా వీర వెంకట సుబ్రహ్మణ్యం, ఆర్థిక కార్యదర్శిగా జొన్నాడ రవికిరణ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్

తాళ్లరేవు: మండలంలోని పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చెక్కా ప్రభాకర్ ఇంటి వద్దే చిన్నబడ్డీ కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కుమారుడైన స్వరూప్ ఆడుకుంటూ రేగిపండు గింజను ముక్కులో పెట్టుకోవడంతో ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయింది. బాలుడిని విశాఖపట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరించి దాన్ని తీయించారు. దీనికిగాను సుమారు రూ.లక్షకు పైగా ఖర్చయింది. ఇబ్బందుల్లో ఉన్న ప్రభాకర్ కుటుంబాన్ని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

బాధితులకు పరామర్శ

అల్లవరం/ఉప్పలగుప్తం: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందిన కుటుంబాలను చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి గురువారం పరామర్శించారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో నడింపల్లి పుల్లంరాజు, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో సలాది విశ్వనాథం కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్కులను అందించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధూర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులను అభివృద్ధి చేశాం

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నంగవరంలో నూతన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్



బోడసకుర్రు-బెండమూర్లంక ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

అల్లవరం: మండలంలోని ప్రధాన రహదారులను విస్తరించి అభివృద్ధి చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.8.12 కోట్లతో బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ 10.44 కిలోమీటర్ల పొడవునా బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ ఐదు గ్రామాలను కలుపుతూ ఏటిగట్టుపై బీటీ రోడ్డు నిర్మిస్తామన్నారు. బోడసకుర్రు వద్ద కాలువపై వంతెన, సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని నిధులు మంజూరు చేయించారని చెప్పారు. బోడసకుర్రు జగనన్న కాలనీలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ తాగునీటి కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గోడి గురుకులం నుంచి మొగళ్ళమూరు, బీరవారిపేట, గుండెపూడి గ్రామాల మీదుగా పోతులవారిపేట వరకు రూ.5.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గోడిలంకలో రూ.20 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, సర్పంచ్ రుద్రరాజు పవిత్ర, బర్రే సీతారత్నం, చిట్నీడి శ్రీదేవి, రాకాపు విజయలక్ష్మి, ముత్యాల వెంకటరామకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, ఎంపీటీసీలు దొమ్మేటి శ్రీశాంతిభవాని, బస్వాని పద్మ, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ప్రభుత్వ సేవలు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా ప్రతి రెండు వేల మంది జనాభాకు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుచేయడంతో సమాయానుకూలంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని నంగవరంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, ఏఎంసీ చైర్పర్సన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరాజాకుమారి, సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ చిక్కం జంగమయ్య, శీలం సూరిబాబు, గనిశెట్టి సద్గురరావు, చిక్కం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి

ఉప్పలగుప్తం: అయినాపురం కెనాల్ నుంచి లక్ష్మీవాడ, కూనవరం కాలువల్లో పూడికతీత పనులను పూర్తి స్థాయిలో నిర్వహించి శివారు ప్రాంతాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని మంత్రి విశ్వరూప్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లవిల్లిలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి విశ్వరూప్ వాడపర్రులో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పూడికతీత పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావుకు మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, వెంకటేశ్వరరావు, మురమళ్ల రామకృష్ణ, నందుల ఏసుబాబు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తుని నిర్ణయించేది ఓటు



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు తదితరులు



ముమ్మిడివరంలో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు హక్కేనని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జి.సత్యవాణి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, చైతన్య వలంటీర్ ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రాజకీయ ప్రలోభాలకు లోను కాకుండా ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డీఈఓ కె.కమలకుమారి ఓటరు దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల జాతీయ దినోత్సవ కార్యక్రమం గురువారం చైతన్యవంతంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి, రెవెన్యూ అధికారి ఎస్.శివాజీ, వివిధ విభాగాల అధికారులు వచ్చే ఎన్నికల్లో ఎలాంటి ఒత్తిళ్లకు లోనవకుండా స్వీయ ఆలోచనతో ఓటు వేస్తామని ప్రతినబూనారు.

ఓటు విలువ ఎనలేనిది

తాళ్లరేవు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ ఎనలేనిదని, ప్రతీఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కె.దత్తాత్రేయవర్మ కోరారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కోరంగి కైట్ కళాశాలలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రా సూర్య వీరాస్వామినాయుడు అధ్యక్షతన నిర్వహించిన న్యూ ఓటర్ సమ్మేళన్-2024 కార్యక్రమానికి దత్తాత్రేయవర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు విధిగా పొందాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ రూరల్ అసెంబ్లీ కార్యదర్శి లీల, బీజేవైఎం సెక్రటరీ కె.వీరవెంకట సూర్యనారాయణమూర్తి, కైట్ కళాశాల చైర్మన్ పోతుల విశ్వం, డైరెక్టర్ ఐశ్వర్య, ప్రిన్సిపాల్స్ రేవతి దూబే, ఏడిద రామకృష్ణ, సిబ్బంది రవికుమార్, రామ్‌కిరణ్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల సమ్మేళనం

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్ కళాశాలలో విద్యార్థులతో కొత్త ఓటర్ల సమ్మేళనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోడీ లైవ్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. విద్యార్థులందరూ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీఐ సెల్ కన్వీనర్ ఆజాద్ నాగ సుధాకొండ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానంద, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు సూచించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- 576 మందికి ఇళ్ల స్థలాల అందజేత



జి.వేమవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: జగనన్న ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలం అందించడంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం జి.వేమవరం పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో మార్కింగ్ చేసిన ఇళ్ల స్థలాలను ఆయన 576 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేపొన్నాడ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 25 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటివరకూ 31 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. జి.వేమవరం లేఅవుట్‌కు సంబంధించి లబ్ధిదారులందరికీ ఒక్కొక్కరికి రూ.1,80,000 చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంట్, ఐరన్‌లను ప్రభుత్వం తక్కువ ధరకే అందిస్తుందన్నారు. ఈ లేఅవుట్‌ను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 27వ తేదీ నుంచి లబ్ధిదారులందరికీ ఆయా సచివాలయాల ద్వారా పట్టా రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించి ఇస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, బూరెల వెంకట్రాజు, కాటంశెట్టి రామ్మూర్తి, దెయ్యాల సత్తిబాబు, మట్టా లింగమూర్తి, నీలపాల శ్రీనివాస్, గండి రామాంజనేయులు, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, రేవు మల్లీశ్వరి పాల్గొన్నారు.

రూ.2 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంపై రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన భవనం, రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం-2 భవనం, కొత్తూరులో రూ.32 లక్షలు, రామన్నపాలెంలో రూ.22 లక్షలు, పటవలలో రూ.43 లక్షలు, శాంతిమూలలో రూ.43 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక నిధులు వెచ్చించి, తాగునీటి సమస్య లేకుండా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, స్థానిక సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు తణుకు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ప్రతిభ చాటాలి



గొల్లవిల్లిలో మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో విద్యార్థులు రాణించాలని రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కబడ్డీ, క్రికెట్‌లో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను మంత్రి విశ్వరూప్ గొల్లవిల్లిలో అభినందించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన క్రీడా వస్తువులను అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, పెయ్యిల రమణ, వీరవల్లి చినబాబు, సలాది శివాజీ, పోలిశెట్టి వీరబాబు, పీడీలు పణీంద్ర, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ బూత్ లెవల్ ఆఫీసర్‌గా వంశీకృష్ణ



ఆర్‌ఏఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వంశీకృష్ణ

తాళ్లరేవు: ఆది ద్రావిడ వెల్ఫేర్ శాఖలో యూడీసీగా విధులు నిర్వహిస్తున్న నేతల వంశీకృష్ణ యానాం నియోజకవర్గ పరిధిలో బెస్ట్ బూత్ లెవల్ ఆఫీసర్ అవార్డు-2024 అందుకున్నారు. ఓటర్ల జాబితా తయారీ, డ్రాఫ్ట్, జాబితా విడుదల, ఓటర్ల నమోదు తదితర కార్యక్రమాల్లో విశేష కృషి చేసినందుకు గుర్తింపుగా ఆర్‌ఏఓ మునిస్వామి ఈ అవార్డును అందజేశారు.

ఎల్ఐసీ ఏజెన్సీ వృత్తి గౌరవప్రదమైనది



ఏజెన్సీ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే సభలో పాల్గొన్న ఎల్ఐసీ లియోఫి యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎల్ఐసీ ఏజెన్సీ వృత్తి గౌరవప్రదమైనదని సంస్థ అమలాపురం లియోఫి యూనియన్ అధ్యక్షుడు సుందరనీడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లయన్స్ హాలులో ఎల్ఐసీ ఏజెన్సీ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రవరం డివిజన్ లియోఫి యూనియన్ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ ఎల్ఐజీ ఏజెన్సీ వృత్తిలో ఏజెంట్లు విలువలు కాపాడుకుంటూ గౌరవ ప్రదంగా సాగాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అమలాపురం, రాజమహేంద్రవరం లియోఫి యూనియన్ ప్రతినిధులు పోలిశెట్టి బ్రహ్మయ్య, మాలే నాగబాబు, పిండి రెడ్డమ్మ, ఎన్.శ్యామ్‌బాబు, కె.జ్ఞానేశ్వర్, అరవింద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు వినతిపత్రం

అమలాపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఇందిర క్రాంతి పథకంలో పనిచేస్తున్న తమ న్యాయమైన కోర్కెలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు సెర్ప్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. గురువారం సెర్ప్ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, పీవీవీ రమణ, కోశాధికారి ప్రసాద్ తదితరులు మండపేటలో ఎమ్మెల్సీ త్రిమూర్తులను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ట్రయల్

అమలాపురం టౌన్: గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం శుక్రవారం ఉదయం స్థానిక బాలయోగి స్టేడియంలో నిర్వహించే పరేడ్ ముందస్తు శిక్షణ, సన్నాహక ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ గురువారం సాయంత్రం పర్యవేక్షించారు. పరేడ్ కోసం ట్రయల్‌ను కూడా నిర్వహించారు. పరేడ్ సమయంలో పోలీసు సిబ్బంది తీసుకోవాల్సిన మెళకువలపై పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్ బాషా పోలీసు వాహనంపై పరేడ్‌కు సంబంధించి ట్రయల్ నిర్వహించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు మదర్ థెరిస్సా వృద్ధుల ఆశ్రమంలో గుళ్ళపల్లి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు విశ్రాంత ఎల్ఐసీ అధికారి సత్యనారాయణ వృద్ధులకు దుస్తులు అందజేశారు. వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు విక్టర్, సోలోమి దంపతులు, సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయ సేవల పరిశీలన

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక సచివాలయం-1లో ప్రభుత్వం అందిస్తున్న సేవలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్ గురువారం పరిశీలించారు. సర్పంచ్ పెనుమాల సునీత, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, జేఏ సత్యనారాయణరాజు ప్రజలకు అందుతున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల ఆటో ఓనర్స్, వర్కర్స్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐ.పోలవరం మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు వీధి నాగభూషణం అధ్యక్షతన గురువారం మురమళ్లలో ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ సమావేశం జరిగింది. సమావేశంలో 2024-25 సంవత్సరానికి గాను కమిటీ అధ్యక్షుడిగా అప్పాడి వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దంగుడుబియ్యం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మచ్చా నాగబాబు, ఉప కార్యదర్శిగా వీధి వెంకన్న, ట్రెజరర్‌గా లక్కవరపు ధనరాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని రాయపురెడ్డి వీరబాబు, గుర్రాల అభిమన్యుడు, రాయపూడి సురేష్ తదితరులు అభినందించారు.

ఈఎస్ఐ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఈఎస్ఐ వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీచైతన్య కళాశాలలో ఈఎస్ఐపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం గురువారం జరిగాయి. ఈఎస్ఐ వైద్యుడు వీఎస్ పాపారావు ఉద్యోగులకు ఈఎస్ఐ సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు మెడికల్ ఇన్సూరెన్స్ ఎలా పొందాలో, సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉండే కార్మికులు ఈఎస్ఐ ద్వారా ఏ విధంగా వైద్య సేవలు పొందాలో వివరించారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎం హరిప్రసాద్, డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేలంగికి సమైక్యతా అవార్డు



కుమార్ శంకర్‌గౌడ్

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ జాతీయ సమైక్యతా అవార్డు ఎంపికయ్యారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని పలు ప్రాంతాల లయన్స్ క్లబ్‌లు గౌడ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశాయి. ఈ నెల 28న విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో గౌడ్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా కుమార్ శంకర్‌గౌడ్‌ను వివిధ రంగాల ప్రతినిధులు అభినందించారు.